# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 02-12-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ఆయా జిల్లాల అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని హోం మంత్రి వంగపూడి అనిత ఆదేశించారు.
- భూ సంబంధిత సమస్యల పరిస్కారంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.
- ప్రజల సమస్యల పరిస్కారానికి చిత్తశుద్దితో కృషి చేస్తున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.
- గిరి ప్రతిభ - ఉచిత డీఎస్సీ శిక్షణను అభ్యర్ధులు సద్వినియోగం చేసుకోవాలనిమంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు.

==================

అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపద్యంలో ఆయా జిల్లాల అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని హోం మంత్రి వంగపూడి అనిత ఆదేశించారు ఫెంగల్ తుఫాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో ఈ రోజు మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో తాజా పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో తిరుపతి జిల్లాలో స్వర్ణముఖి నది ఉధృతంగా ప్రవహిస్తోందని, నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాల్లో వాగులు, వంకల పొంగిపొర్లుతున్నందున పరిసరాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. తిరుపతి, తిరుమల ప్రాంతాలలో వర్షాలతో కొండచరియలు జారిపడుతున్న నేపథ్యంలో భక్తుల రాకపోకలు, భద్రత పట్ల దృష్టి పెట్టాలని కలెక్టర్లను హోం మంత్రి ఆదేశించారు.

==================

భూ సంబంధిత సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో మంత్రి పాల్గొని వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ప్రజల స్నేహ పూర్వక ప్రభుత్వమని అన్నారు. ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిస్తుందని వివరిస్తూ....

(వాయిస్ 27 సెకన్లు)

===================

గిరి ప్రతిభ-ఉచిత డీఎస్సీ శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. పార్వతీపురంలో ఐటిడిఎ ఆధ్వర్యంలో గిరిజన అభ్యర్థులకు ఉచిత డీఎస్సీ శిక్షణ ను గిరిజన సామాజిక భవనంలో ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలో మొదటి గిరి ప్రతిభ-ఉచిత డీఎస్సీ శిక్షణ కేంద్రాన్ని జిల్లాలో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ శిక్షణ ప్రతి రోజు ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు రెండు నెలల పాటు కొనసాగుతుందని మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్, పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ పాల్గొన్నారు.

===================

ప్రజల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని రాష్ట్ర జనవరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గ ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారానికై రూపొందించిన ప్రత్యేక వెబ్ సైట్ ను మంత్రి పాలకొల్లులో ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిత్యం తన వద్దకు వివిధ సమస్యలతో వచ్చే ప్రజలకు పూర్తి స్థాయిలో న్యాయం అందించేందుకు ప్రత్యేక వెబ్ సైట్ ను అందుబాటులో తెచ్చామని పేర్కొన్నారు.

===================

ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు అధికారులను ఆదేశించారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఈ రోజు కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో పోలింగ్ అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలింగ్ ప్రక్రియపై పీవో, ఏపీవో, ఓపీవో, మైక్రో అబ్జర్వర్ల, సెక్టార్ అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సహాయ రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ... ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పోలింగ్ సిబ్బందికి కృషి చేయాలన్నారు. పోలింగ్ ఈనెల 5న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందన్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్ లను సురక్షితంగా కాకినాడ జేఎన్టీయూ డా.బీఆర్.అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీ లో స్ట్రాంగ్ రూముకు తరలించేంత వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

===================

యువతను భారతదేశ సాంస్కృతిక వారసత్వంతో అనుసంధానించడంతో పాటూ సంగీత పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ, రాష్ట్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖలు సంయుక్తంగా విజయవాడలో ఈనెల 6 నుండి 8వ తేదీ వరకు "కృష్ణవేణి సంగీత నీరాజనం" ఉత్సవాలను నిర్వహిస్తున్నాయి. ప్రధాన ఉత్సవాని కంటే ముందు నిన్నటి నుండి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభ వేడుకలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శ్రీకాకుళంలో మంద సుధారాణి బృందం, రాజమహేంద్రవరంలో తులసి విశ్వనాథ్ బృందం ఇచ్చిన ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

విరామం

===================

విజయనగరం జిల్లాలో సుమారు 300 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టామని రాష్ట్ర సుక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులపై మంత్రి ఈ రోజు కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఉపాధిహామీ పథకంలో చేపట్టిన రహదారులు, కాలువలు, గోకులాల నిర్మాణం తదితర పనుల ప్రగతిని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మంత్రికి వివరించారు. పనులను వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఈ సందర్భంగా ఆదేశించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... 200 కోట్ల రూపాయల విలువైన 2,165 పనులను మంజూరు కాగా, వాటిలో 184 పనులు పూర్తి అయ్యాయని మంత్రి వెల్లడిస్తూ....

(వాయిస్ 27 సెకన్లు)

===================

రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని విభజన అంశాలపై చర్చించేందుకు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఉన్నతాధికారుల కమిటీ ఈ రోజు సమావేశం అయింది. ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారి జరుగుతున్న ఈ భేటీలో ఇరు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ సమావేశమైంది. విద్యుత్ బకాయిలు, ఉమ్మడి సంస్థల ఖర్చులను తిరిగి చెల్లించే అంశంతో పాటు విభజన పూర్తికాని సంస్థలకు చెందిన నగదు నిల్వలు, విభజన చట్టంలోని 9, 10 షెడ్యూల్‌లో సంస్థల ఆస్తుల పంపకాలపై ప్రధానంగా చర్చించనున్నారని అధికారులు తెలిపారు.

===================

కార్తీకమాసం ముగింపు సందర్భంగా విశాఖ జిల్లా సింహాచలం శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి వారి వరాహ పుష్కరిణి వద్ద భక్తులు ఈరోజు పోలిపాడ్యమి వేడుక నిర్వహించారు. వివిద ప్రాంతాల నుండి వేకువజామునే మహిళలు పుష్కరిణి వద్దకు చేరుకొని సంప్రదాయం ప్రకారం దీపాలు వదిలి పెట్టారు. మరోవైపు సింహాచలం క్షేత్రంలో ప్రతి సంవత్సరం జరిగే శ్రీ నృసింహ మండల దీక్షలు కూడా ఈ రోజు సంప్రదాయబద్ధంగా ప్రారంభమయ్యాయి.

===================

ఫెంగాల్ తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు సోమశిల, కండలేరు జలాశయాలకు వరద నీరు వచ్చి చేరుతోంది. మరో 24 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారులు ప్రజలకు సూచనలు జారీ చేశారు. దీనిపై మరిన్ని వివరాలను మా నెల్లూరు జిల్లా ఆకాశవాణి ప్రతినిధి అమర్ అందిస్తారు.

(వాయిస్ 26 సెకన్లు)

===================

భారత వైమానిక దళం ఉద్యోగాలపై యువతలో అవగాహన కల్పించేందుకు ఈ నెల 6, 7వ తేదీల్లో అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నామని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ రోజు గిరి ప్రతిభ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ... ఈనెల 6 వ తేదీన సీతంపేటలో, 7వ తేదీన పార్వతీపురంలో ఈ అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులకు యువత హాజరై సంబంధిత ఉద్యోగాల పట్ల అవగాహన పెంచుకొని, విజయం సాధించేందుకు కృషి చేయాలని కలెక్టర్ కోరారు.

===================

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని తిరుపతి స్థానికులు దర్శించుకునేందుకు మహతి ఆడిటోరియంలో ప్రత్యేక దర్శన టోకెన్ల జారీ ప్రక్రియను టీటీడీ చైర్మన్ బి ఆర్ నాయుడు, టిటిడి కార్యనిర్వహణాధికారి జె. శ్యామల రావుతో, అదనపు కార్యనిర్వాహణాధికారి వెంకయ్య చౌదరితో కలిసి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ బి ఆర్ నాయుడు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి సూచనల మేరకు తిరుపతి రూరల్ చంద్రగిరి, రేణిగుంట ప్రాంతవాసులకు స్వామివారి దర్శనం కల్పించే ప్రక్రియను ప్రారంభించామన్నారు. ప్రతి నెలలో మొదటి మంగళవారం నాడు  స్థానికులకు శ్రీవారి దర్శనం కలిగించేందుకు ముందురోజు భక్తులకు టోకెన్లను జారీ చేస్తోంది. మహతి ఆడిటోరియం ప్రాంగణంలో 7 దర్శన టోకెన్ల జారీ కేంద్రాల ద్వారా 2,500 టోకెన్లను, తిరుమలలో బాలాజీ నగర్ లోని సామాజిక భవనంలో మరో 500 టోకెన్లను టిటిడి జారీ చేయనుందని తెలిపారు.

===================

===================